

నేడు నారాయణపురంలో అపుస్మా జిల్లా సమావేశం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రైయివేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) ఏలూరు జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల 9న ఉంగుటూరు మండలం నారాయణపురం లయన్స్ క్లబ్ అడిటోరియంలో నిర్వహించనున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుణ్ణం బుల్లెబ్బాయి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ, పశ్చిమగోదావరి జిల్లా ఎంఎల్‌సి, అపుస్మా స్టేట్ ప్రెసిడెంట్ ఎంవి రామచంద్రారెడ్డి, ఉంగుటూరు ఎంఎల్ఎ వాసుబాబులు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం ప్రైయివేటు పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులను గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని సన్మానించనున్నామని తెలియజేశారు.

కుల వృత్తులకు ప్రోత్సాహం

కిక్కిరిసిన చించినాడ బ్రిడ్జి

- శాశ్వత కుల ధ్రువీకరణ పత్రం అందించేందుకు కృషి
- ఉపాధి హామీ అనుసంధానంతో తాడి చెట్లు పెంపకం
- బిసిల సంక్షేమ పథకాల రద్దు వైపిపి ప్రభుత్వ నిర్వాకం
- మెరుగైన లిక్కర్ పాలసీ తీసుకొస్తాం
- శెట్టిబలిజ సామాజిక తరగతి ముఖాముఖిలో నారా లోకేష్

ప్రజాశక్తి - భీమవరం

తాము అధికారంలోకి రాగానే కులవృత్తులకు ప్రోత్సాహం కల్పిస్తామని, గతంలో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన అనేక బిసి సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేయడమే కాకుండా 26 వేల మందిపై అక్రమ కేసులు బనాయించిన జగన్ బిసి ద్రోహి అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. యువగళం పాదయాత్ర శుక్రవారం 208వ రోజు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో సాగింది. కలగంపూడి యువగళం క్యాంప్ సైట్ వద్ద ఏర్పాటు చేసిన శెట్టిబలిజ సామాజిక తరగతి ప్రతినిధులతో ముఖాముఖిలో లోకేష్ పాల్గొన్నారు. సంఘాల నేతలు నరసింహమూర్తి, వెంకట్, రాంబాబు తదితరులు అనేక సమస్యలు లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. కల్లుగీత, కొబ్బరిదింపు తదితర వృత్తుల మీద ఎన్నోఏళ్ల నుంచి ఆధారపడి జీవిస్తున్నామన్నారు. 50 ఏళ్లు వచ్చిన వారికి పెన్షన్లు, గుర్తింపు కార్డు అందించడంతోపాటు ప్రభుత్వ స్థలాల్లో తాడిచెట్లను పెంచి వృత్తులను కాపాడాలని కోరారు. బిసిల సంక్షేమంతోపాటు రాజ్యాధికారం అందించేలా చేయూతనివ్వాలని కోరారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ కష్టాన్ని నమ్ముకున్న వ్యక్తులు శెట్టిబలిజలని అన్నారు. తాము అధికారంలోకి రాగానే గతంలో అమలు చేసిన పథకాలన్నీ పునరుద్ధరిస్తామన్నారు. మంత్రి తన శాఖలో ఉన్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం 26 వేల దొంగ కేసులు పెట్టిందని, దీనిలో ఎక్కువ కేసులు బిసిలపైనే ఉన్నాయని అన్నారు. ప్రస్తుత మద్యం పాలసీని రద్దు చేసి మెరుగైన పాలసీ తీసుకొస్తామన్నారు. తాడిచెట్టు పెరగాలంటే 12 ఏళ్లు పడుతుందని, వీటని జోన్లు వారీగా పెంచుతామని అన్నారు. ఉపాధి హామీకి తాడిచెట్ల పెంపకం, రక్షణను అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి బిసిలను పేదరికం నుంచి బయటకు తీసుకొస్తామన్నారు. తెలంగాణ మాదిరిగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి రుణాలు, సబ్సిడీలు అందిస్తామన్నారు. చేతివృత్తిదారులకు గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. ప్రస్తుతం ఇస్తున్న కుల ధ్రువీకరణ పత్రాలు ఆరు నెలలే చెల్లుబాటులో ఉంటున్నాయని, టిడిపి అధికారం చేపట్టాక శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాన్ని అందించే ఏర్పాటు చేస్తామన్నారు.

బిసి కళ్యాణ మండపానికి నేనే రిబ్బన్ కట్ చేస్తా

పాలకొల్లులో టిడిపి ప్రభుత్వ హయాంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యాన రూ.కోటీ 50 లక్షలతో నిర్మాణం చేపట్టిన బిసి కళ్యాణమండపాన్ని వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దారుణమని లోకేష్ అన్నారు. తాము అధికారంలోకి ఆరు నెలల్లో ఆ కళ్యాణ మండపాన్ని సుందరంగా తీర్చిదిద్ది తానే రిబ్బన్ కట్ చేస్తాని హామీ ఇచ్చారు.

నిమ్మలను భారీ మెజార్టీతో గెలిపించండి

పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు నీతి నిజాయతీ గల నాయకుడని, ఏదైనా పని చేయాలనుకుంటే తాను నిద్రపోడని, మిగిలిన వారిని నిద్రపోనీయడని లోకేష్ వ్యాఖ్యానించారు. అటువంటి కష్టపడి పని చేసే నాయకుడిని ప్రజలంతా ఆదరించాలని, నిమ్మల హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని అన్నారు. అయితే గతం కంటే రెట్టింపు మెజార్టీని అందించి నిమ్మలను గెలిపించాలని పిలుపునిచ్చారు. శాసనమండలి మాజీ వైస్ ఛైర్మన్ రెడ్డి

పాదయాత్రలో నారా లోకేష్‌తోపాటు జిల్లాకు చెందిన ముఖ్య నేతలు

సుబ్రహ్మణ్యం, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ టిడిపి అంటే బిసి.. బిసి అంటే టిడిపి అని అన్నారు.

పశ్చిమలో ముగిసిన పాదయాత్ర

ఈ నెల మూడో తేదీ మధ్యాహ్నం జిల్లాలోని గణపవరం మండలంలో ప్రవేశించిన యాత్ర ఐదు రోజులపాటు జిల్లాలో సాగింది. ఉండి, భీమవరం, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల గుండా చించినాడ బ్రిడ్జి మీదుగా శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ కోనసీమ జిల్లాలోకి ప్రవేశించింది.

కిక్కిరిసిన చించినాడ బ్రిడ్జి

లోకేష్ యువగళం పాదయాత్ర బృందంతో వశిష్ట గోదావరిపై చించినాడ వంతెన కిక్కిరిసిపోయింది. లోకేష్‌కు స్వాగతం పలుకుతూ గోదావరి మధ్యలో పసుపు జెండాలు, బెలూన్లతో అలంకరించిన పడవలతో మత్స్యకారులు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వీటిని లోకేష్ కొద్దిసేపు తిలకించారు, పాదయాత్ర మధ్యలో నేత కార్మికులు, రైతుల సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం యాత్ర కోనసీమ జిల్లా దిండిలోకి ప్రవేశించింది. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎంపీ మాగంటి బాబు, టిడిపి నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బొప్పన హరికిషోర్, కడలి గోపాలరావు, గుబ్బల ఏడుకొండలు, గుబ్బల ఓంకార్, రుద్రరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలునికి లోకేష్ పరామర్శ

ప్రజాశక్తి - భీమవరం

తాడేరు టౌన్ షిప్ వద్ద ఈ నెల 5వ తేదీ రాత్రి జరిగిన వైసిపి, టిడిపి పరస్పర దాడి ఘటనలో గాయపడిన బాలుడు దుర్గాప్రసాద్‌ను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పరామర్శించారు. దాడిలో దుర్గా ప్రసాద్ కంటి పైభాగంలో రాయి తగిలి గాయమైన సంగతి తెలిసిందే. తాజాగా లోకేష్‌ను చూసేందుకు దుర్గాప్రసాద్ కలగంపూడి రాగా దగ్గరకు తీసుకుని పరామర్శించి, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

కరెంటు కోత.. బిల్లుల మోత..!

ఒకపక్క కరెంటు కోతలు, మరోపక్క విద్యుత్ బిల్లుల మోతతో జనం అల్లాడిపోతున్నారు. జిల్లాలో విద్యుత్ వినియోగదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. వర్షాకాలం సైతం పల్లె, పట్టణం అంటూ అనే తేడా లేకుండా గంటలు తరబడి కరెంటు కోతలు అమలవుతున్నాయి. జిల్లా కేంద్రం ఏలూరులో సైతం అర్ధరాత్రి వేళల్లో కరెంటు కోతలతో జనం విలవిల్లాడుతున్నారు.

- పల్లె, పట్టణం తేడా లేకుండా ఎడాపెడా కోతలు
- అర్ధరాత్రి వేళల్లో కోతలతో తీవ్ర ఇబ్బందులు
- మరోపక్క అదనపు ఛార్జీలతో బిల్లుల మోత
- లబోదిబోమంటున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 లక్షల వరకూ గృహవిద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అత్యధిక కనెక్షన్లు సామాన్య ప్రజానీకానివే. ఎప్పుడు కరెంటు పోతుందో.. ఎప్పుడు ఉంటుందో తెలియని దుస్థితి నెలకొంది. అర్ధరాత్రి వేళల్లో కరెంటు కోతలు విధించడంతో దోమలు, ఉక్కపోతతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక స్తోమత ఉన్నోళ్లు కరెంటు కోతలు భరించలేక ఇన్వర్టర్లు కొనుగోలు చేస్తుండగా, ఆర్థిక పరిస్థితి బాగోలేని కుటుంబాలు చీకటిలోనే మగ్గుతున్నాయి. కరెంటు కోతలతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిరు వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకపక్క పెరిగిన విద్యుత్ బిల్లులు కట్టలేక, మరోపక్క కరెంటు కోతలతో వ్యాపారం సరిగ్గా సాగక సతమతమవుతున్నారు. ఆక్వా రైతులు సైతం కరెంటు కోతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2014 తర్వాత కరెంటు కోతలు దాదాపుగా లేకుండాపోయాయి. ఇటీవల కాలంలో కోతలు పెరగడం జనంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సాయంత్రం ఏడుగంటల సమయంలో కరెంటు తీసేయడంతో విద్యార్థులు సైతం చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జిరాక్స్ షాపులు, వెల్డింగ్ వ్యాపారులు ఇలా అనేక మంది చిరువ్యాపారులు కరెంటు కోతలతో ఉపాధి కోల్పోతున్నారు. బిల్లులు పెద్దఎత్తున వసూలు చేస్తూ కూడా కోతలు విధించడం జనంలో హాట్‌టాపిక్‌గా మారింది. కొన్నిచోట్ల లోవోల్టేజీ కరెంటుతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్యాన్లు తిరగవు, లైట్లు వెలగని పరిస్థితి ఏర్పడుతోంది. అదేమని అడిగితే ట్రాన్స్‌ఫార్మర్ వేయాల్సి ఉందని సమాధానం చెప్పి దాటవేస్తున్న పరిస్థితి ఉంది.

అదనపు ఛార్జీల పేరుతో బిల్లుల మోత

కరెంటు బిల్లుల్లో ప్రభుత్వం విధిస్తున్న అదనపు ఛార్జీల మోత జనాలను గుక్కతిప్పుకోనీయకుండా చేస్తున్నాయి. కరెంటు బిల్లుకు సమానంగా అదనపు ఛార్జీల భారం పడుతోంది. ఫిక్స్‌డ్ ఛార్జీలు, కష్టమర్, ఇడి, సర్‌ఛార్జీ, ట్రూఅప్ ఛార్జీ, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరుతో మోత మోగించేస్తున్నారు. ఏలూరులోని ఓ వినియోగదారుడికి రూ.417 కరెంటు బిల్లు వస్తే అంతేస్థాయిలో అదనపు ఛార్జీలు వేయడంతో రూ.781 బిల్లు వచ్చింది. దీంతో సదరు వినియోగదారుడు లబోదిబోమంటున్నాడు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. కరెంటు బిల్లులు కట్టలేక సామాన్య ప్రజానీకం విలవిల్లాడుతున్నారు. గతంలో ఎప్పుడో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు అదనపు ఛార్జీల రూపంలో వసూలు చేయడంపై వినియోగదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తీరుపై సర్వత్రా ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. కరెంటు బిల్లులు సామాన్య ప్రజానీకానికి భారంగా మారడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అదనపు ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని జనం ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

ఎసిబి వలలో ఆర్ఐ

రూ.38 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి రెవెన్యూ శాఖలోని మరో అవినీతి చేప ఎసిబి వలకు చిక్కింది. రూ.38 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధకశాఖ అధికారులు వల పన్ని శుక్ర వారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆర్ఐ పద్మ రోజా తన నివాసంలో లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడింది. ఎసిబి, డిఎస్‌పి శరత్ బాబు తెలిపిన వివరాల ప్రకారం కందుల పద్మ రోజా మండవల్లి రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తూ, మండవల్లి రైల్వే గేట్ సమీపంలోని ఇంటిలో అద్దెకు ఉంటుంది. మచిలీపట్నంకు చెందిన బోయిన సాయికిరణ్‌కు అయ్యవారి రుద్రవరంలో తాతలనాటి 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే ఆ భూమిని సబ్ డివిజన్ చేయడం నిమిత్తం మండవల్లి రెవెన్యూ కార్యాలయాన్ని ఆశ్రయించాడు.

ఎసిబి అధికారులకు పట్టుబడ ఆర్ఐ సర్కిల్‌లో)

ఆర్ఐ పద్మ రోజాను కలుసుకుని రుద్రవరంలో ఉన్న ఆరు ఎకరాల భూమిని సబ్ డివిజన్ చేయాలని కోరాడు. ఆమె సబ్ డివిజన్ చేసేందుకు ఎకరానికి రూ.30 వేల చొప్పున లంచం ఇవ్వాలని కోరింది. దీంతో ఎకరానికి రూ.30 వేల చొప్పున లంచం ఇచ్చేందుకు ఇష్టపడని సాయికిరణ్ అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం ఆమె నివాసంలో సాయికిరణ్ రూ.38 వేలు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు ట్రాప్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన తెలిపారు. పూర్తిస్థాయిలో విచారించి కోర్టులో హాజరపరుస్తామని ఆయన వివరించారు. ప్రజలకు సేవలందించడం అధికారుల బాధ్యత అన్నారు. సేవలందించడానికి లంచాలను అడగడం చట్టరీత్యా నేరమని తెలిపారు ఈ దాడిలో ఎసిబి సిఐలు కె.ఏసుబాబు, ఎన్‌వి.భాస్కరరావు, కె.నాగేంద్ర ప్రసాద్ ఉన్నారు.

క్రీడాకారుల ప్రతిభ వెలికితీయడమే లక్ష్యం

జెసి బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య తెలిపారు. సెట్‌వెల్, క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై జెసి మాట్లాడారు. ఏలూరు జిల్లాలో 605 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పోటీల నిర్వహణకు ఈనెల 30వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లూ పూర్తిచేయాలని ఆదేశించారు. ఏర్పాటు చేసిన కమిటీలతో గ్రామ సచివాలయాల స్థాయిలో ఎంపిడిఒలు, వార్డు స్థాయిలో పురపాలక సంఘం కమిషనర్లు పూర్తి బాధ్యత తీసుకొని ముందస్తుగా సమావేశాలు నిర్వహించాలన్నారు. దాతలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను వినియోగించుకోవాలన్నారు. క్రీడాకారులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు, సిబ్బందికి, ఆడ, మగవారికి వేర్వేరుగా స్థానిక వసతిగృహాలు కేటాయించాలని, సాంఘిక సంక్షేమ శాఖ, బిసి సంక్షేమ శాఖ అధికారులను జెసి ఆదేశించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి క్రీడాకారుల సామగ్రి పొందిన వెంటనే వాటిని భద్రపర్చేందుకు మండల, జిల్లా స్థాయిలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. 15 ఏళ్లు దాటిన గ్రామీణ యువతీ, యువకులతో పాటు, ఉన్నత పాఠశాలలో 10వ తరగతి, ఆపైన జూనియర్ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఏ ప్రాంతంలో ఏయే క్రీడలు ఆడుతున్నారో అందరికీ తెలిసేలా ముందుగా పత్రికలకు తెలియ జేయాలన్నారు. యువతీ, యువకులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. వీటికి తోడుగా యోగా, టెన్నికాయిట్, నడక, పరుగు పందెం, జాగింగ్, లెమన్ స్పూన్ పందేలు, ఇతర పేరొందిన సాంప్రదాయ ఆటలు కూడా అదనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. వీలైనంత ఎక్కువ మంది ప్రజలు ఈ పోటీల్లో పాల్గొనేలా కృషి చేయాలన్నారు. రవాణా సౌకర్యం నిమిత్తం రవాణాశాఖ సంబంధిత శాఖల సమన్వయంతో ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో భోజన సౌకర్యాలకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. క్రీడలు విజయవంతం చేయాలని

కోరారు. జిల్లా స్థాయిలో అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఏలూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 605 గ్రామ, వార్డు సచివాలయాలకు అక్టోబరు 02వ తేదీ నుంచి 09 వరకూ, 27 మండల, 3 మున్సిపాల్టీ స్థాయికి 10వ తేదీ నుంచి 21 వరకూ, 7 నియోజవర్గ స్థాయికి 22వ తేదీ నుంచి 27 వరకూ, ఏలూరు జిల్లా స్థాయి అక్టోబరు 28వ తేదీ నుంచి నవంబరు 03 వరకూ రాష్ట్రస్థాయి నవంబరు 04వ తేదీ నుంచి 08 తేదీ వరకూ జరుగుతాయని తెలిపారు. ఏలూరు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, సెట్వెల్ సిఇఒ, డిఇఒ, డిఎంహెచ్ఒ అందరికి ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని తెలిపారు.

జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ డేకు స్పందన

పెదవేగి జెకెసిలో 122 అర్జీలు స్వీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి - పెదవేగి

ప్రజా సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు మండలస్థాయిలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ డేకు మంచి స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. శుక్రవారం పెదవేగి మండలం రాట్నాలకుంట అన్నపూర్ణ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం మండలస్థాయి గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్, జిఎస్ డబ్ల్యుఎస్ నోడల్ అధికారి రమణ, అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపిపి తాతా రమ్య, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెకెసిలో వివిధ సమస్యల పరిష్కారం కోసం 122 మంది అర్జీలను అందజేశారని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి బుధ, శుక్రవారం ఆయా మండలాల్లో జగనన్నకు చెబుదాం మండలస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులంతా పాల్గొంటారన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన జగనన్నకు చెబుదాం తొలి కార్యక్రమాన్ని పెదవేగి మండలంలో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని అక్కడికక్కడే వివరాలు నమోదు చేయడం కోసం మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం అర్జీలను నేరుగా స్వీకరించడం జరిగిందన్నారు. జెకెసిలో అందిన అర్జీలను పరిష్కరించడంపై ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈనెల 13వ తేదీన చింతలపూడి మండలంలో, 15న ద్వారకాతిరుమల మండలంలో, 20న టి.నరసాపురం మండలంలో, 22న ఉంగుటూరు మండలంలో, 27న ముసునూరు మండలంలో, 29న కలిగింది మండలంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు జెకెసి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ జెకెసిలో అందిన అర్జీలను ఆయా శాఖల వారీగా నమోదు చేసుకుని వాటిని సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుం దన్నారు. వైఎస్ఆర్ బీమా కింద గ్రామాల్లో నూరుశాతం నమోదయ్యేలా సంబంధిత అధికారులు చూడాలన్నారు. స్పందనలో అందిన అర్జీల్లో కొన్నింటి పరిష్కార తీరులో అర్జీదారుల్లో అసంతృప్తి ఉందని, వాటిని నూరుశాతం రీఓపెన్ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా సంబంధిత జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ జి.మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జెకెసిలో వచ్చిన అర్జీల్లో కొన్ని..

పెదవేగి మండలం రాయనపాలెంకు చెందిన వికలాంగుడు పలగని శ్రీనివాసరావు మూడు చక్రాల వాహనం ఇప్పించాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. రాయనపాలెంకు చెందిన తాళం ప్రసాద్ అర్జీనిస్తూ బాపిరాజు గూడెంలో తమకు వ్యవసాయభూమి ఉందని దాన్ని ఆన్‌లైన్ చేయాలని కోరారు. తగు చర్యలు తీసుకోవాలని పెదవేగి తహశీల్దార్ నాగరాజును కలెక్టర్ ఆదేశించారు.

'కోడూరుపాడు'ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు రెవెన్యూ డివిజన్ స్థాయిలో పైలట్ గ్రామంగా ఎంపికై, నూరు శాతం స్వమిత్వ సర్వే పూర్తి చేసుకున్న కోడూరుపాడు గ్రామాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆదర్శంగా తీసుకోవాలని భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ పద్మావతి దేవి కోరారు. జిల్లాస్థాయిలో సమగ్ర గ్రామాభివృద్ధిపై శిక్షణ పొందుతున్న గ్రామపంచాయతీ కార్యదర్శులు స్వమిత్వ సర్వేపై అవగాహన కోసం భీమడోలు మండలం కోడూరుపాడు గ్రామానికి శుక్రవారం వచ్చారు. ఈ తరహా శిక్షణకు వచ్చిన రెండో బ్యాచ్‌కి చెందిన సుమారు 70మంది పంచాయతీ కార్యదర్శులకు స్వమిత్వ కార్యక్రమంపై జిల్లా సమన్వయకర్తగా పనిచేస్తున్న శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పరిధిలోని 32.90 ఎకరాల విస్తీర్ణంలో గ్రామ కంఠం ఉండగా, వీటిలో నివాసం ఉంటున్న 725 గృహాల స్వమిత్వ సర్వే కార్యక్రమం పూర్తైందన్నారు. త్వరలో వారికి యాజమాన్య హక్కు పత్రాలను అందజేయమన్నామన్నారు. వీటిలో కొన్ని స్థలాలు పట్టా భూములుగా ఉన్నాయన్నారు. వీటన్నిటితో కలిపి గ్రామంలోని అన్ని నివాస గృహాలకు యాజమాన్య హక్కు పత్రాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరుపాడు గ్రామ సచివాలయ పరిధిలోని కోడూరుపాడు, దుద్దేపూడి గ్రామాలకు చెందిన సర్పంచులు ఎం.నాగేశ్వరరావు, ఎన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న గ్రామపంచాయతీ కార్యదర్శులు

నారాయణపురం ఉపాధ్యాయునికి ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - ఉంగుటూరు

అఖిల భారత సివిల్ సర్వీస్ ఎపి రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో భాగంగా శుక్రవారం విజయవాడ డిఆర్ఎంసి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో ఉంగుటూరు మండలం నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, యుటిఎఫ్ జిల్లా క్రీడా కన్వీనర్ గొల్లపల్లిరామారావు ద్వితీయ బహుమతి సాధించారు. ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో భాగంగా పరుగుపందెం ఈవెంట్‌లో రామారావు ఈ ఘనత సాధించారు. పాఠశాల ఉపాధ్యాయులు అతన్ని అభినందించారు.

స్పందన ఫిర్యాదులకు ప్రాధాన్యతివ్వాలి : డిపిఒ

డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి - పెదవేగి

స్పందన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. విజయరాయి గ్రామ సచివాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రత్నలగుంటలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి హాజరైన డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్ ఏలూరు తిరుగు ప్రయాణంలో విజయరాయి సచివాలయం సందర్శించి, సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ఇ-గ్రామస్వరాజ్ ప్రగతిపై, నగదురహిత చెల్లింపులపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి బి.శ్రీనివాసులు, కార్యదర్శులు ఎం.నీరజ, సౌజన్య పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంఎల్ఎ

టి.నరసాపురం : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తున్నామని పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని రాజుపోతే పల్లిలో ప్రజల వద్దకు వెళ్లి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం 200 రోజులు పూరైన సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'సరోజిని మృతి బాధాకరం'

చింతలపూడి : పనిపట్ల అంకితభావం కలిగిన ఉపాధ్యాయురాలు దాసరి సరోజిని మృతి చెందడం బాధాకరమని చింతలపూడి బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు తెలిపారు. స్థానిక బాలకోన్నత పాఠశాల చింతలపూడిలో తెలుగు భాషా ఉపాధ్యాయురాలిగా పనిచేయుచున్న దాసరి సరోజినీ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. నివాళులర్పించారు.

ఎక్సెల్‌స్పోర్ట్స్ కిట్ల సేవలను వినియోగించుకోవాలి

భీమడోలు : ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అందజేస్తున్న ఎక్సెల్‌స్పోర్ట్స్ కిట్ల సేవలను వినియోగించుకోవాలని భీమడోలు మండలం విద్యాధికారి-1 ఇ.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని వివిధ పాఠశాలలకు కేటాయించిన స్పోర్ట్స్‌కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి స్థానిక మండల వనరుల కేంద్రంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎంటిలు సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

'వ్యవసాయం నిలవాలి, రైతు గెలవాలి'

నూజివీడు రూరల్ : 'వ్యవసాయం నిలవాలి, రైతు గెలవాలి' అనే నినాదంతో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నట్లు అగ్రికల్చరల్ ఎడి విద్యాసాగర్ తెలిపారు. నూజివీడులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఆర్‌బికెలు ఏర్పాటుతో ఇ-క్రాప్ నమోదు, జియో టాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లో 26 వేల వరి సాగు అవుతున్నట్లు తెలిపారు. శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నూజివీడు రూరల్ : వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జెడి వి.జయప్రకాష్ తెలిపారు. పట్టణంలో సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల హాస్టల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని తెలిపారు.

సంపూర్ణ అక్షరాస్యతకు కృషి

భీమడోలు : మండలాన్ని సంపూర్ణ అక్షరాస్యతా మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మండల విద్యాధికారి ఇ.శ్రీనివాసరావు తెలిపారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయ వాలంటీర్లు నిర్వహించిన సర్వేల్లో 5 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్కులైన 1,071 మంది బడి ఈడు పిల్లలు బడి బయట ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరినీ పాఠశాలలో చేర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

సంస్థాగత నిర్మాణం పటిష్టంగా ఉండాలి

భీమడోలు : స్వయం సహాయక సంఘాల సంస్థాగత నిర్మాణాలు పటిష్టంగా ఉంటే ఆశించిన ఫలితాలను సాధించవచ్చునని వైఎస్ఆర్ క్రాంతి పథం భీమడోలు ఏపిఎం సురేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం స్వయం సహాయక సంఘాల గ్రామస్థాయి కమిటీ సభ్యులతో నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిసిలు రంగమ్మ, సీత పాల్గొన్నారు.

మినీజాబ్ మేళాలో 34 మందికి ఉపాధి

కొయ్యలగూడెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రకాశం డిగ్రీ కళాశాల కొయ్యలగూడెంలో శుక్రవారం నిర్వహించిన మినీజాబ్ మేళాకు 123 యువత హాజరు కాగా వీరిలో 34 మంది వివిధ కంపెనీలలో ఉపాధి పొందినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సి.మధు భూషణ్ రావు, వి.జనార్ధన్ రావు పాల్గొన్నారు.

అర్హులైన ఎస్టిలకు న్యాయం చేస్తాం

ముదినేపల్లి : విచారించి అర్హులైన ఎస్టిలకు న్యాయం చేస్తామని ఐటిడిఎ కెఆర్.పురం ప్రాజెక్టు అధికారి సూర్యతేజ తెలిపారు. మండలంలోని గురజ ఎస్టి కాలనీవాసులు(కొండరెడ్లు) తమకు ఎస్టీ ఏజెన్సీ పత్రాలు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదంటూ ఐటిడిఎ స్పందనలో అర్జీ అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణ చేసేందుకు నలుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ శుక్రవారం గురజ ఎస్టి కాలనీని సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ఎస్టిలకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, ఆర్డిఒ కె.పేచ్చులక్షిశోర్, మండల తహశీల్దార్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనారోగ్య మహిళా కార్యకర్తకు ఆర్థిక సహాయం

జంగారెడ్డిగూడెం : అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి పట్టణ మహిళా నాయకురాలు తానినేని సుమలతకు టిడిపి యువనాయకులు బొమ్మిడి అనిల్ రూ.10వేల ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సాయిల సత్యనారాయణ, ఉడతనేని మధు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

టి.నరసాపురం : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మక్కినవారిగూడెం ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మండలస్థాయి ఆటల పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగే ఆటల పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

చట్టబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి

జంగారెడ్డిగూడెం : వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలు నియమావళి ప్రకారం, చట్ట ప్రకారం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ముక్కా ద్వారకానాథ్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల నియమావళిపై ప్రకటన విడుదల చేశారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో 5 గేదెలు మృతి

నూజివీడు రూరల్ : మీర్జాపురం గ్రామంలో విద్యుత్ షాక్‌తో 5 పాడి గేదెలు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గుండుబోయిన శ్రీనివాసరావుకు చెందిన గేదెలు మేపుకొని తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ హారన్‌కు అవి బెదిరిపోయి పామాయిల్ తోట వైపు పరుగులు తీశాయి. అక్కడ కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో పశువులు మృతి చెందాయి.

గుండెపోటుతో కార్మికుడు మృతి

నూజివీడు రూరల్ : పట్టణంలో శుక్రవారం డ్రిల్లింగ్ మిషన్ కార్మికుడు గుండె పోటుతో మరణించిన సంఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని ఎపిఎస్ఆర్టిసి బస్టాండ్ సమీపంలో డ్రిల్లింగ్ మిషన్ వర్క్ చేస్తుండగా, హఠాత్తుగా నీరసం రావడంతో తన స్నేహితుల సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళుతుండగా మార్గమధ్యలో గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలో తీవ్రవిషాదాన్ని నింపింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జల్లేరు వంతెన గోడను ఢీకొన్న కారు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలోని వేగవరం జల్లేరు వాగుపై నూతనంగా నిర్మిస్తున్న వంతెన గోడను కారు ఢీకొన్న సంఘటన శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున నిర్మాణంలో ఉన్న జల్లేరు వంతెనను ముందు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ కారులో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారులో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

13న మండల సభలో అభ్యంతరాలు వెల్లడి

ప్రజాశక్తి - ముసునూరు

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం పనులపై గ్రామసభ నిర్వహించినట్లు ఎపిఒ టి.రోజ్‌లీలా తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ముసునూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్‌పర్సన్ రవిబాబు మాట్లాడుతూ 2022-23వ సంవత్సరం ఉపాధి హామీ చట్టంలో 56 రకాలు పనులపై గతవారం రోజుల నుంచి ఇంటింటికీ వెళ్లీ పనులపై ఎంక్వరీ చేయగా, కొందరు మాత్రమే కలవడం జరిగిందన్నారు. మరికొందరు ఇండ్ల వద్ద లేకపోవడంతో వారు ఏవైనా అభ్యంతరాలు వున్నట్లయితే ఈనెల13వ తేదిన జరిగే మండలసభలో తమ సమస్యలు తెలియజేయాలన్నారు. రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ రామచంద్రరావు మాట్లాడుతూ ఉపాధి పనులు నాణ్యతతో కూడిన పనులు చేయించాలని, కొందరు వారం రోజులు పాటు పనిచేసి సంతకాలు పెట్టడం మర్చిపోతున్నారన్నారు. ముసునూరు పంచాయతీ పరిధిలో 56 రకాల పనిదినాలకు పని ప్రదేశంలో నేమ్ బోర్డులు పెట్టాలని వుండగా, అప్పటి ఎపిఒ జె.జయప్రసాద్ పెట్టకపోవడంతో అతని వద్ద నుంచి రూ.13,300లు రికవరీ చేయించినట్లు తెలిపారు. ప్రభుత్వం సగటున పనికి రోజువారి వేతనం రూ.257లు వుండగా, రూ.167లు మాత్రమే వుండటం గమనార్హం. గ్రామసభలో ఉపాధిహామీ పనులు చేయించే మెట్లు రాకపోవడం వల్ల వేసవిలో పని ప్రదేశంలో కూలీలకు మంచినీళ్ల ఏర్పాట్లు, టెంట్ ఏర్పాట్లు మొదలైనవి లేక ఎండ వేడిమికి తట్టుకోలేక కూలీలు పడుతున్న సమస్యలు పైస్థాయి అధికారులకు తెలిసే పరిస్థితి వుండేదని గ్రామస్థులు అనుకుంటున్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లారిసోర్స్‌పర్సన్ రవిబాబు..

స్టేషనరీ సామాన్లు అందజేత

ఏలూరు అర్బన్ : హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో శిక్షణ పొందుతున్న 150 మంది జూనియర్ లెవెల్ విద్యార్థులకు వారికి ఉపయోగకరమైన స్టేషనరీ సామానులను అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బొల్లా సత్యనారాయణ, కోశాధికారి డి.రమాదేవి, ట్రైనింగ్ ఆఫీసర్ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ

పోలవరం : పోలవరం మండల నిర్వాసిత గ్రామాలైన టేకూరు, చీడూరు, శివగిరి, తూటగుంట, మాదాపురం, నాన్ ట్రైబల్‌లకు చెందిన జంగారెడ్డిగూడెం, చల్లవారి గూడెం గ్రామంలో ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించామని పోలవరం మండల తహశీల్దార్ బి.సుమతి తెలిపారు. ఈ నిర్వాసిత గ్రామాలైన 141 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశామన్నారు. ఈ ఇళ్ల స్థలాల పట్టాలను మండల తహశీల్దార్ బి.సుమతి, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

తల్లిదండ్రులు బాధ్యతగా మెలగాలి

ఉంగుటూరు : ఇంటర్‌మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులను ఇంటి వద్ద బాగా చదివించేలా తల్లిదండ్రులు మరింత బాధ్యతగా మెలగాలని నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజి ఇంఛార్జి ప్రిన్సిపల్ బెజగం వెంకట శ్రీనివాసు కోరారు. శుక్రవారం ఆ కాలేజీలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ మూడు నెలల కాలంలో విద్యార్థుల చదువులో ప్రగతి, మార్కులపై తల్లిదండ్రులతో సమీక్షించారు.

సమస్యలపై చర్చ

పోలవరం : మండలంలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దత్త రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇ-క్రాప్ బుకింగ్, కొత్తూరు చెరువు సంబంధించి సప్లై ఛానల్, తూములు వేసి సాగునీరుకు ఇబ్బంది లేకుండా చూడాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు ఇబ్బంది లేకుండా తాళ్లపూడి ట్యాగ్ చేయవలెనని, వెటర్నరీ వ్యవసాయ శాఖ ఇరిగేషన్ తదితర శాఖల ప్రగతిని వివరించారు.

జ్ఞానజ్యోతులు ఉపాధ్యాయులు

ముదినేపల్లి : పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలుస్తూ జ్ఞానజ్యోతులుగా వెలిగించే వారే ఉపాధ్యాయులని ముదినేపల్లి మండల ఎంఇఒ ఎం.సేవ్య తెలిపారు. స్థానిక సహాయమాత స్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కె.హరిబాబు, వై.కృష్ణకుమారి, వి.సత్యనారాయణ, డి.వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎఎన్ఎంల బకాయి వేతనాలు చెల్లించాలి : సిఐటియు

కుక్కునూరు : ఎఎన్ఎంల ఏడు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యుల సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు వివిధ వ్యాధులతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న సందర్భంలో ప్రజల ఆరోగ్యాలను కాపాడటానికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎఎన్ఎంలు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతూ, విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఏడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ గడవక, ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కునూరులో ఒక ఎఎన్ఎం జీతాలు రాక, ఇంటి అద్దె చెల్లించలేదని ఇంట్లో నుంచి వెళ్లిపోండి అని ఒత్తిడి తెస్తున్నారని తెలియజేశారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు వినతులు సమర్పించినా స్పందన లేదని, కుక్కునూరు వచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డికి సమస్యలు చెప్పుకోవాలని వెళ్తే ఎఎన్ఎంలను అడ్డుకుని నిర్బంధించడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎఎన్ఎంలకు రావాల్సిన ఏడు నెలల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేసి, అధికారుల వేధింపులు ఆపాలని, లేదంటే ఏజెన్సీ పరిధిలో ఉన్న ఎఎన్ఎంలు అందరినీ ఐక్యం చేసి సమస్య పరిష్కరించేంత వరకూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు తిరోజుల సురేష్, కుర్ర గ్రేసి, మాధవి, రమాదేవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి : ఐద్వా

ప్రజాశక్తి - ఏలూరు

దేశంలో పేరులు మార్చటం కాదని, మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా డిమాండ్ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం ఏలూరు సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో 'దేశంలో ప్రజాస్వామ్యం - మహిళలు, చిన్నారులకు రక్షణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు డాక్టర్ పి.సురేష్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం పేర్లు మార్చే పనిలో ఉందని, కానీ ప్రజల బ్రతుకులు మాత్రం మార్చటం లేదని విమర్శించారు. ముఖ్యంగా ప్రపంచంలో అతి గొప్ప ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశంలో మహిళలు చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పెంచి పోషిస్తున్న మతోన్మాద ఘర్షణలో సైతం ఆడవాళ్లనే ఉపయోగించుకుంటున్నారన్నారు. దానికి నిదర్శనం మణిపూర్‌లో మహిళలని నగ్నంగా ఊరేగించి, అత్యాచారాలు చేయడం అన్నారు. స్వయంగా మణిపూర్‌లో ఇటీవల పర్యటించి వచ్చానని ఆయన అనేక వివరాలు తెలిపారు. ఐద్వా నాయకులు జె.హరీషాదుర్గ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై అత్యాచారాలు మరింత పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి మహిళలు చిన్నారులపై అత్యాచారాలు అరికట్టాలని' రాసిన బ్యానర్‌పై సంతకాలు సేకరించారు. ఈ సంతకాల కార్యక్రమంలో విద్యార్థినిలు, లెక్చరర్లు అంతా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ పి.మెర్సి, సిస్టర్ మెరిసి క్రిస్టీ, సిస్టర్ పద్మావతి, ఐద్వా ఏలూరు నగర ఉపాధ్యక్షులు సిహెచ్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున్న నాయకులు

'ఆడుకుందాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

భీమడోలు : మండల పరిధిలోని వివిధ గ్రామ సచివాలయాల స్థాయిలో అక్టోబర్ 2వ తేదీ నుంచి నిర్వహించే 'ఆడుకుందాం ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ పద్మావతి దేవి కోరారు. ఈ నేపథ్యంలో పోటీల నిర్వహణపై స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన పిఇటిలు, పిడిలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయాల స్థాయి నుంచి గ్రామస్తుల్లో ముఖ్యంగా విద్యార్థుల్లో క్రీడల ప్రదర్శనకు, క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు 'ఆడుకుందాం ఆంధ్ర' కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మండల స్థాయిలో అక్టోబర్ 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ 'ఆడుకుందాం ఆంధ్ర' కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండల విద్యాధికారి ఇ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీల నిర్వహణపై ఎంపిడిఒ విజయ్ కుమార్ గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఆటల పోటీలు అక్టోబర్ 2వ తేది నుంచి ప్రారంభమవుతాయని, కబడ్డీ, కోకో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలకు సిద్ధమయ్యే క్రీడాకారులు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు, హెచ్ఎంలు, పిడిలు పాల్గొన్నారు.

పస్తుత ఖరీఫ్ సాగు ఆశాజనకం..

ఏలూరు : జిల్లాలో 1.48 లక్షల ఎకరాల ఆయుకట్టుకు గాను ఇంతవరకు 1.35 లక్షల ఎకరాల్లో(91.23శాతం) వరినాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నీటిపారుదల, వ్యవసాయ సలహా మండలి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు నెలలో సానుకూలంగా వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంటూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సాగు పరిస్థితి అశాజనకంగా ఉందన్నారు. నీటిపారుదల శాఖ అధికారుల అంచనా మేరకు ఖరీఫ్ పంటకు అవసరమైన సాగునీరు ఆశాజనకంగా ఉందని తెలియజేశారు. గత రెండు నెలల్లో ఇరిగేషన్ ఎఇలు, డిఇలు పర్యటించిన టూర్ డైరీని అందించాలని ఇరిగేషన్ ఎస్ఇని ఆదేశించారు. నూజివీడు మండలంలోని దిగవల్లి గ్రామంలో ఉన్న 130 కెవి సబ్ స్టేషన్ ప్రారంభం గురించి పరిశీలనకు నూజివీడు సబ్ కలెక్టర్ సోమవారం వెళ్లవలసిందిగా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జెడ్‌పి ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ మాట్లాడారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలు విషయంలో పంట చేతికివచ్చే ముందే ముందస్తు సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముందస్తు ధాన్యం కొనుగోలు ఏర్పాటు గురించి జెసి అంగీకారం తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, ఇరిగేషన్ ఎస్ఇ కె.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, ఉద్యానశాఖ అధికారి రామ్మోహన్, పలువురు ఇరిగేషన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

చింతలపూడి : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్థాయిలో ప్రజలను అవగాహన పెంచేలా వైద్య సిబ్బంది, ఎఎన్ఎం, ఆశావర్కర్స్ అందరూ విస్తృతంగా గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిపి డా.బాణావతు రాంబాబు తెలిపారు.

మహనీయుల ఆశయ సాధన కోసం కృషి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

విద్యుత్ పోరాట అమరవీరుడు సత్తెనపల్లి రామకృష్ణ, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు, ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావు వంటి మహనీయుల ఆశయ సాధన కోసం పనిచేయటమే వారికి నిజమైన నివాళులని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం ఉదయం స్థానిక ఆర్ఆర్ పేటలోని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో అమర వీరుల వర్ధంతి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పత్తిపాటి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. వారి ఆశయ సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తామని ప్రతిజ్ఞ బూనారు. ప్రతిఒక్కరూ వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, గొర్రెలు మేకల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు ఆగోళ్ల వెంకట కృష్ణారావు, వడ్రం పనివాళ్ల సంఘం ఏలూరు నగర కార్యదర్శి కొత్తల శివకుమార్, సుందరయ్య గ్రంథాలయం నిర్వాహకులు కంది విశ్వనాథం, ప్రజాశక్తి బుక్ హౌస్ ఇంఛార్జి హరిప్రియ పాల్గొన్నారు.

హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న విద్యార్థులకు సూచనలు

చింతలపూడి : విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా గుర్తించి పిహెచ్‌సికి పంపిస్తూ ఉంటామని, రక్తం తక్కువగా ఉన్న విద్యార్థులకు తగు సూచనలు ఇస్తున్నామని చింతలపూడి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. చింతలపూడి పట్టణంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హెల్త్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రగుంటపల్లి పిహెచ్‌సి నుంచి సిహెచ్ఒ కె.దిలీప్, ఆశా వర్కర్ శ్యామల రాణి, ఎంపిహెచ్ ఎ.సయ్యద్ జఫ్రూలా కళాశాలకు విచ్చేసి విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్ష చేశారు. ఈ సందర్భంగా హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థులకు తగు జాగ్రత్తలు చెప్పి, రక్త శాతం పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్స్‌పెక్షన్ కమిటీ డా.బి.సరస్వతి పాల్గొన్నారు.

80 మందికి నేత్ర పరీక్షలు

జంగారెడ్డిగూడెం : సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తాడువాయి గ్రామ బిస్మిల్లా చికెన్ సెంటర్‌లో జంగారెడ్డిగూడెం డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పటాన్ మస్తాన్, పఠాన్ బాజీ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంను డాక్టర్ రాజీవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. నిడదవోలు జాగృతి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ 80 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. వారిలో 25 మందికి కళ్ల జోళ్లు అవసరం ఏర్పడగా జాగృతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో 50 శాతం రాయితీలో అవసరమైన కళ్ల జోళ్లు పంపిణీ చేసామన్నారు. అలాగే 8 మందికి కంటి ఆపరేషన్‌లు చేయాల్సి ఉండగా నిడదవోలుకు తీసుకెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేయిస్తామన్నారు.

మైఖేల్ రాబర్ట్ క్రెమెర్ పూళ్ల హైస్కూల్ సందర్శన

ప్రజాశక్తి - భీమడోలు

ఆర్థిక శాస్త్రంలో నోబుల్ బహుమతి గ్రహీత, అమెరికా దేశానికి చెందిన మైఖేల్ రాబర్ట్ క్రెమెర్ తన బృందంతో భీమడోలు మండలం పూళ్ళ హైస్కూలును శుక్రవారం సందర్శించారు. ప్రపంచంలోని పలు విశ్వవిద్యాలయాలలో వివిధ హోదాల్లో అధ్యాపకులు, ఆచార్యులుగా పనిచేసిన క్రెమర్ ఆర్థిక శాస్త్రంలో తన పరిశోధనలకు గాను 2019వ సంవత్సరంలో మరొక ఇద్దరు శాస్త్రవేత్తలతో కలిసి నోబుల్ బహుమతి సంయుక్త గ్రహీతగా నిలిచారు. వివిధ అంశాలపై అధ్యయనానికి మన దేశ పర్యటన వచ్చిన ఆయన శుక్రవారం పూళ్ళ హైస్కూల్‌కు విచ్చేసి సందర్శించారు.

నోటీసు
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 306/2019
బిట్వీన్:
అబ్బిన శ్రీనివాస్ -వాది
మరియు
కొఠారు దేవి ప్రసన్న -ప్రతివాది
పై నెంబరు గ్రంథంలో ప్రతివాది అయిన శ్రీమతి కొఠారు దేవి ప్రసన్న, భర్త: వెంకట రమేష్, సావిత్రి నగర్, హుకుంపేట, రాజమండ్రి అను వారు కోర్టు వారి నోటీసులు సమన్లు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున ది. 21-9-2023వ తేదీ పగలు 10.30 ని॥లకు మీరు ప్లీడరు గారి ద్వారా గాని, స్వయంగా గాని హాజరు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)
కాజ నాగేశ్వరరావు, అడ్వకేట్
తాడేపల్లిగూడెం, సెల్: 9989538628

వేలం ప్రకటన
మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు
ఇ.పి.నెం. 216/2010
ఓ.ఎస్.నెం. 56/2005
శ్రీమతి బొప్పన వాణి .... డి.హెచ్.ఆర్.
మరియు
శ్రీమతి కాకరాల రంగనాయకమ్మ వగైరా.. జె.డి.ఆర్స్
పై నెంబరు ఇ.పి. గ్రంథములో డిక్రీ ప్రకారం డి.హెచ్.ఆర్.కు రావలసిన బాకీ రాబట్టుటకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిలోని జె.డి.ఆర్స్. తాలూకు 3/4వ వంతు వాటాను ది.21-9-2023వ తేదీన పైకోర్టులో వేలం వేయబడును. సదరు వేలంలో పాల్గొనదలచిన వారు పై కోర్టు వారి ఎదుట ది.21-9-2023వ తేదీన ఉదయం గం.10-30 ని॥లకు హాజరై వేలంలో పాల్గొనవచ్చును. వేలం వేయబడు ఆస్థి వివరం:
ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, వెంకటాపురం పంచాయితీ, శివనగర్, కొత్తూరు రోడ్డులోని 550 చ.గ.లు అందులోని డోరు నెం. 13/36రు గల యిల్లు మరియు కరెంటు కనెక్షన్‌తో సహా ఆస్థికి హద్దులు : తూర్పు - సంపంగి బుజ్జయ్య గారి ఇల్లు, దక్షిణం - రోడ్డు, పడమర - రోడ్డు, ఉత్తరం - ఆర్నేపల్లి రంగారావు గారి యిల్లు పైహద్దుల మధ్య గల 550 చ.గ.లు స్థలం అందులోని యిల్లులో జె.డి.ఆర్స్ తాలూకు 3/4 వంతు వాటా ఆస్థి
డి.హెచ్.ఆర్. విలువ : రూ.2,50,000/-లు
అమీనా విలువ : రూ. 10,25,000/-లు
ఎస్.వి.ఆర్. గాంధీ, డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది
ఏలూరు, తేది : 05-09-2023

ప్రతి ప్రధానోపాధ్యాయుడు పాల్గొనాలి

ముసునూరు : నేషనల్ ఇన్‌ఫెక్షన్ కార్యక్రమంలో ప్రతి ప్రధానోపాధ్యాయుడు పాల్గొనాలని నూజివీడు డివైఇఒ నాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, ELURU
E.A.No. 1/2023
in
E.P.No. 90/2022
in
O.S.No. 90/2022
Between :
Sri. Govindu Nagaraju -Petitioner / D.Hr.
and
Sri. padala Satyam - Respondent / J.Dr.
Respondent / J.Dr.
Padala Satyam,S/o.Sanyasi (Late) Hindu, Age 61 years, Dr.No. 20E-13-22, Pappala vari street, Kothapeta, Eluru, Eluru District
పై E.P. వారెంటు గ్రంథములో J.Dr. కు నోటీసు నిమిత్తం పై పిటిషన్‌ను ది.21-9-2023 నకు వాయిదా వేసినారు. సదరు పిటిషన్ విషయముపై J.Dr. కు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా రోజు ఉదయం గం.10-30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తెలుపుగొనవలెను. లేని యెడల పరోక్షముగా విచారించి తీర్మానించెదరని, ఇందు మూలముగా తెలియజేయడమైనది.
శ్రీ కోర్టు వారి అనుమతితో ---
ఇట్లు : సిహెచ్.వెంకట రమణారావు, వి.వి.సాయి రామారావు, అడ్వకేట్స్, ఏలూరు, సెల్ : 8247742566,
ఏలూరు, తేది : 1-9-2023

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, భీమడోలు
ఒ.ఎస్. నెం. 29/2019
కెనరా బ్యాంక్ (పూర్వపు సిండికేట్ బ్యాంక్) ఎస్‌జివి బ్రాంచ్, ఏలూరు -వాది
మరియు
1. బండి హనుమంతరావు
2. కుంకుళ్ళ వరలక్ష్మి -ప్రతివాదులు
టు:
కుంకుళ్ళ వరలక్ష్మి, భర్త: లేటు పద్మారావు, డోరు నెం. 6ఎ-7-9, దక్షిణపు వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా.
పత్రికా ప్రకటన
పై నెంబరు దావా గ్రంథములో 2వ ప్రతివాది మహారాజశ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము మీకు కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపించిననూ అవి ప్రతివాది తీసుకొనక త్రిప్పి పంపుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు ప్రతివాదికి దావా సమన్లు పత్రికా ప్రకటన మూలంగా తెలియచేయుటకు ఆర్డరు చేసియున్నారు. పై దావా గ్రంథము ది. 27-09-2023వ తేదీకి వాయిదా అయి వున్నది. కావున ఆరోజున మీరు స్వయముగా గాని, లేదా మీ తరపున న్యాయవాది ద్వారా గాని ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు కావలయును. లేని యెడల కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.
వాయిదా తేది: 27-09-2023
టి.వి.విశ్వనాథం, అడ్వకేట్
అగ్రహారం, ఏలూరు, సెల్: 9441040029

ప్రకటన
మహారాజశ్రీ భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 154/2018 in O.S. 221/2014
Between:
గుంటా బాటమ్మ అనే గంగమ్మ -పిటీషనరు/వాది
మరియు
గులిమే నాగమ్మ (died) మరికొందలు -రెస్పాండెంట్లు/ ప్రతివాదులు
ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా, పై నెంబరు దావా గ్రంథములోని వాది అయిన శ్రీమతి గుంటా బాటమ్మ అనే గంగమ్మ, W/o. నక్షత్రం, హిందూ, స్త్రీ, వయస్సు 55 సం॥లు, నారాయణపురం, ఉంగుటూరు (మం), ప్రస్తుతం ఏలూరు జిల్లా అను వారు శ్రీమతి గులిమే నాగమ్మ (died) మరికొందరిపై పార్టీషను దావా దాఖలు చేయగా, అందులో 16వ రెస్పాండెంటు/ ప్రతివాది గులిమే పోతురాజు, S/o. లేటు గంగయ్య, రామశింగవరం (V), ద్వారకాతిరుమల (మం) అనువారు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుటకు ప్రయత్నించుచున్నందున వారికి పేరు పబ్లికేషను ద్వారా సమన్లు అమలు జరిపించుటకు శ్రీ కోర్టు వారు అనుమతి ఇచ్చినందున సదరు దావా గ్రంథము ది. 18-09-2023 సం॥ తేదీన వాయిదా ఉన్నందున వారు (మీరు) పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపరచుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున పై నెంబరు దావా తీర్మానించబడునని తెలియచేయడమైనది.
(పై కోర్టు వారి ఉత్తర్వులతో)
కొండేపాటి వెంకటేశ్వరరావు
ఎస్.గోపాలకృష్ణ
అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం
సెల్: 9848355344

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
Creditor I.P. 25/2022
బిట్వీన్:
కొవ్వూరి నాగేంద్రరెడ్డి -పిటీషనరు/ పిటీషనరు
Vs
కొండేటి సత్యవతి & 7 Others -రెస్పాండెంట్లు/ రెస్పాండెంట్లు
ప్రకటన
పై నెంబరు గ్రంథములో 5వ రెస్పాండెంటు అయిన ఏముల వేణుగోపాల్, S/o. late వెంకటరమణ, వ్యాపారం, 37 సం॥లు, డో.నెం. 3-51, సిపాయిపేట, తాడేపల్లిగూడెం-1 వాస్తవ్యులు మరియూ 6వ రెస్పాండెంటు అయిన ఏముల దేవి కిరణ్, S/o. late వెంకటరమణ, 32 సం॥లు, వ్యాపారం, డో.నెం. 3-51, సిపాయిపేట, తాడేపల్లిగూడెం-1 వాస్తవ్యులు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచుండుట వలన ఈ పత్రికా ప్రకటన ద్వారా 5వ రెస్పాండెంటుకు, 6వ రెస్పాండెంటుకు వారి ఆఖరు చిరునామాకు నోటీసులు జారీ చేయగలందులకు శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసినందున 5 మరియు 6 రెస్పాండెంట్లుకు ఈ పత్రికా ప్రకటన ద్వారా నోటీసులు కోర్టు వారి ఉత్తర్వులు మేరకు జారీ చేయడమైనది. సదరు 5వ రెస్పాండెంటు మరియు 6వ రెస్పాండెంటు ఇరువురూ ది. 27-9-2023వ తేదీన స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పైన తెలిపిన కోర్టుకు హాజరై మీ ఇరువురికి గల ఆక్షేపణలు శ్రీ కోర్టు వారికి తెలియపర్చగలరు. అట్లు కాని ఎడల మీరు ఇరువురూ శ్రీ కోర్టు వారిచే పరోక్షంగా తీర్మానింపబడుదురని యిందుమూలముగా ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎస్.ఎన్.తాజుద్దీన్ బాబా
పిటిషనరు/ పిటీషనరు తరపు న్యాయవాది
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
ది.04-9-2023 సెల్: 9949014216